
# శ్రీమద్భాగవత ప్రశ్నోత్తర మాలిక




## "శ్రీ గురుభ్యో నమః" విద్యార్థిని విద్యార్థుల సేకరణ

## www.gurujnanam.org

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

# విషయ సూచిక


| CD# | | Page |
|---|---|---|
| 3.2 | | |
| | జడ భరతుడు | 1 |
| | భాగవతములో  దశావతారములు మరియు భరత వర్షము | 4 |
| 3.3 | | |
| | భగవన్నామ స్మరణము - అజామిళుడి కథ | 7 |
| | ఇంద్రునికి బ్రహ్మహత్యా పాతకం కలుగుట మరియు వృత్రాసురుని జన్మమ్ | 9 |
| 3.4 | | |
| | వృత్రాసురుడు | 12 |
| | చిత్రకేతోపాఖ్యానం | 15 |
| 3.5 | | |
| | ప్రహ్లాద చరిత్ర - సహజ భక్తి | 17 |
| | ప్రహ్లాద  భాగవత ధర్మ బోధిని | 21 |
| 4.1 | | |
| | ప్రహ్లాద తత్త్వం, నారసింహ ఆవిర్భావం/తత్త్వం | 24 |



gurujnanam.org

Copyright@gurujnanam.org    Disclaimer:This document is not for commercial purpose

# జడ భరతుడు

1.జఢుడు  అనగా ఎవరు?


జ. భగవంతుని విషయం లో స్పందన ఉండదు కాని ప్రపంచ విషయం లో స్పందన ఉన్నవాడు.

2.మనకి, యోగులకి ఉన్న తేడా ఏమిటి?

జ. మనం జ్ఞాన విషయంలో, భగవంతుని విషయంలో నిద్రపోతాం. యోగులు ఆ విషయం లోనే మేలుకుంటారు.

3.అసలైన శివరాత్రి అని దేనిని అంటారు?

జ. భగవత్ ప్రజ్ఞలో ముడిపడిన బుద్ధితో , ఆ విషయంలో నిరంతరం మెలుకువగా ఎవరుంటారో వారే అసలైన శివరాత్రి చేసుకున్నవారు. అంటే యోగులు భగవత్ విషయంలో నిరంతరం మెలుకువగా వుంటారు. కావున వారిది నిజమైన శివరాత్రి.



4.సంసారం లంపటులైన వారందరు కలిసి జీవన్ముక్తుడిని ఏమని పిలుస్తారు?

జ. పిచ్చివాడు అని, జఢుడు  అని  పిలుస్తారు.

5. దేహ సంఘాతం అంటే ఏమిటి?

జ. దేహేంద్రియ మనసు, అంటే దేహం, మనసు, ఇంద్రియములు, ప్రాణం, బుద్ధి.

6.దేహ ధర్మాలు అంటే ఏమిటి?

జ. దేహ ధర్మాలు పెరగడం, తరగడం, యవ్వనం, వార్ధక్యం, రోగ గ్రస్తం అవ్వడం మరియు జనన మరణాలు దేహ ధర్మాలు.

7.ప్రాణ ధర్మాలు ఏవి?

జ. ఆకలి దప్పికలు ప్రాణ ధర్మాలు.

8. మనో ధర్మాలు ఏవి?


జ. భయము, శోకం, సుఖము, దుఃఖము మనో ధర్మాలు.

9. ఇంద్రియ సంఘాతములు అన్నీ దేని వల్ల పని చేస్తున్నాయో, దాని అసలు స్వరూపం ఏమిటి?

జ. ఇంద్రియ సంఘాతములు అన్నీ ఆత్మ వల్ల పని చేస్తున్నాయి. కాని ఆత్మకు ఈ ఇంద్రియ సంఘాతములు ఏమి లేవు. ఆత్మ  అసలు రూపం సత్,చిత్.

10.జీవన్ముక్తుడికి ఒక ఉదాహరణ ఇవ్వండి?

జ. కొలనులో ఉన్న ఏనుగు అడవి తగలపడుతుంటే అడవిని సాక్షి గా ఎలా చూస్తూ ఉంటుందో, ఆత్మ స్థితి లో ఉన్నటువంటి యోగి జగత్ యొక్క పరిణామాలని అలా సాక్షి భూతం గా చూస్తూ ఉంటాడు.



11. తత్త్వ జిజ్ఞాస కి తత్త్వ జ్ఞానం కి తేడా ఏమిటి?

జ. తెలుసుకోవాలనే తపన పేరు జిజ్ఞాస. జ్ఞానం అంటే తెలుసుకోవడం.
కనుక జిజ్ఞాస తపన, జ్ఞానం సిద్ధి.

12.గురువు అంటే ఎవరు?

జ. గురువు అనేది ఒక శరీరం కాదు. ఆ శరీరం ద్వారా ప్రకటితం అవుతున్న ఒకానొక జ్ఞానం.

13. సనాతన ధర్మం వల్ల ఉపయోగం ఏమిటి?

జ. జీవులని ఏ దేశం లో వారి నైనా, ఏ ప్రాంతంలో వారి నైనా తరింప చేసేది సనాతన ధర్మం ఒక్కటే.

14. స్వస్వరూపం ఎలా  తెలుస్తుంది?

జ. వ్యాపకాలు తగ్గించు కోవడం మొట్టమొదటి సాధన. అంటే ముందుగా వ్యాపకాలు తగ్గించుకోవాలి, తరువాత తొలగించుకోవాలి. అప్పుడు అసలు స్వరూపం తెలుస్తుంది.

15. పరమాత్మ యొక్క రెండు  లక్షణాలు లేదా స్వరూపాలు ఏమిటి?

జ. సత్ చిత్. సత్ అంటే ఎప్పుడూ ఉండేది, చిత్ అంటే చైతన్యం (ఎప్పుడు వుండే చైతన్యం).

gurujnanam.org

16. ఉంది అనేది దేని యొక్క లక్షణం?
జ. ఉంది అనేది  ఆత్మ యొక్క లక్షణం. అది ఇంద్రియాలదీ కాదు మరియు దేహానిదీ కాదు. ఆత్మ యొక్క లక్షణం వల్లనే, ఉంది అని తెలుగుసుకోగలుగుతున్నాం.

17. ప్రపంచం అంతా దేనియందు భాసిస్తుంది?
జ. ఆత్మ యందు భాసిస్తున్నది.

18. మౌనం అంటే ఏమిటి?
జ. మన మనస్సులో వికారపు అలజడులు తగ్గి అసలు స్థితి ఏర్పడితే దాని పేరు మౌనం. మౌన వాఖ్యాత్ ప్రకటితం పరబ్రహ్మ తత్త్వం.

19. క్షేత్రజ్ఞుని లక్షణములు ఏమిటి?
జ. క్షేత్రజ్ఞుని లక్షణములు: అజరః, అమరః, పురుషః, పురాణః, స్వయంజ్యోతిః, నారాయణః, భగవాన్ వాసుదేవః.

20.మన శత్రువు ఎవరు?
జ. నీ స్వస్వరూపాన్ని తెలియకుండా చేసే వారే శత్రువు. మన మనస్సే మన శత్రువు.

21.మనసు పరమాత్మ వైపు ఎలా మరల్చాలి?
జ. మనసుకి గురుచరణాలని, హరి చరణాలని ఆశ్రయించటం అలవాటు చేయించాలి. వారు నిరంతరం పరమాత్మ గురించి చెప్పడం వల్ల, మనసు క్రమంగా పరమాత్మ వైపు మళ్ళుతుంది.

22. అంతఃకరణ లోని 3 దోషాలు ఎమిటి?
జ. సత్వ, రజో, తమో గుణ దోషాలు.

# భాగవతములో దశావతారములు మరియు భరత వర్షము

23.భవారణ్యం అంటే ఏమిటి?

జ. సంసార అరణ్యం.

24. అరణ్యం అంటే అర్ధం ఏమిటి?

జ. అరణ్యం అంటే దుఃఖ స్థానం.

25. వేదాంత భాషలో సత్సంగం అంటే ఏమిటి?

జ. సద్వస్తువుతో ఎవరు నిరంతరం ఉంటాడో వాడితో సంగం ' సత్సంగం'.

26.శిశుమారం అంటే అర్ధం ఏమిటి?

జ. శిశుమారం అంటే నీటికోతి అంటే మొసలి (crocodile ) ఆకారము .సమస్త గ్రహ నక్షత్రములు కలిపి చూస్తే ఆ మొసలి ఆకారములో ఉంటాయి. ఒక్కొక్క నక్షత్రము లేక గ్రహము మొసలి శరీరముపై ఉన్న ఒక్కొక్క "నాట్ ".

27. శిశుమార చక్రము లో ఏమి ఉంటాయి?

జ. మనం చూస్తున్న ఈ గ్రహనక్షత్రాదులన్నీ శిశుమార చక్రంలో ఇమిడి ఉన్నాయి.

28.భువనకోశ వర్ణన అంటే అర్ధం ఏమిటి?

జ. అనంత బ్రహ్మాండ గ్రహనక్షత్రాదులు, వాటిని అధిష్టించిన దేవత లక్షణములు, మన ఇంద్రియాలతో చూడలేని తేజోవంతమైన శరీరములు, వాటి యొక్క వర్ణనని భువనకోశ వర్ణన అంటారు.

29.ఒక ద్వీపాన్ని ఎన్ని వర్షములుగా చేశారు?

జ. నవ వర్షములు.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

30.వర్షం అంటే ఏమిటి?
జ. వర్షం అంటే దేశము.

31. జంబూద్వీపము యొక్క వర్షముల పేర్లు ఏవి?
జ. ఇలావృత, రమ్యక, హిరణ్మయ, కురు, హరి, కింపురుష, భరత, కేతుమాల, భద్రాశ్వ.

32. జంబూద్వీపము ఎక్కడినుంచి మొదలవుతుంది?
జ. మేరుపర్వతము నుంచి సరయు, శతధృ, గంగ వంటి పరమ పవిత్రమైన నదులు ప్రవహిస్తున్న మేరనుంచి లెక్క కట్టి చెప్పారు జంబూద్వీపమని.



33. భూమియందు మేరు పర్వతం ఏది?
జ. కైలాస పర్వతం.

34. ఇలావృత వర్షంలో ఉన్న ఒక్క మగాడు ఎవరు?
జ. శివుడు.

35.ఇలావృత వర్షములో శివుడు ధ్యానించే విష్ణువు పేరు ఏమిటి?
జ. సంకర్షణుడు.

36. సంకర్షణుడి యొక్క మంత్రం ఏది?
జ. " ఓం నమో భగవతే మహా పురుషాయ సర్వగుణసంఖ్యానాయ అనన్తాయ అవ్యక్తాయ నమ ఇతి".



37.భద్రశ్రవ వర్షంలో ఉపాసింపబడే నారాయణుడి స్వరూపము ?
జ. ధర్మస్వరూపుడు (ధర్ముడు).

38. హరివర్షములో నారాయణునిది ఏ స్వరూపము ?
జ. నరసింహ స్వామి రూపంలో.

39.కేతుమాల ద్వీపంలో భగవానుడు ఏరూపంలో ఉంటాడు?
జ. **లక్ష్మి**తో కలిసి కామదేవుని ( ప్రద్యుమ్నుడు) రూపంతో ఉంటాడు.

40. ప్రద్యుమ్న నామము దేనికోసం జపించాలి?
జ. మనోనిబ్బరం కోసము.

41. రమ్యక ద్వీపం లో స్వామి ఏ రూపంతో ఆరాధింపబడుతున్నాడు?
జ. మత్స్య రూపంతో ఆరాధింపబడుతున్నాడు.



42. హిరణ్మయ వర్షంలో భగవంతుడు ఏ రూపంతో ఉన్నాడు?
జ. కూర్మరూపుడై ఉన్నాడు.

43. కురు వర్షములో నారాయణుడు ఏ రూపంలో ఉన్నాడు?
జ. యజ్ఞ పురుషుడైన వరాహస్వామి రూపంలో ఉన్నాడు.

44. కింపురుష వర్షంలో అది నారాయణుని ఎలా పూజిస్తారు?
జ. పరమ భాగవతులైన కింపురుషులు హనుమతో కలిసి శ్రీరామచంద్ర స్వరూపాన్ని పూజించుకుంటున్నారు.

45.హనుమంతుడు ఏ స్వరూపుడు?
జ. రుద్ర స్వరూపము.

46.అన్ని వర్షాలలో అత్యంత ఉత్కృష్టమైన వర్షం ఏది?
జ. భరత వర్షము.

47.భరత వర్షం అని ఎలా వచ్చింది?
జ. నాభి, ఋషభ దేవుడు, భరతుడి నుంచి వచ్చింది.

48.భరత వర్షంలో విష్ణువు ఏ రూపంతో ఎలా ఉన్నాడు?
జ. విష్ణువు భరతవర్షంలో నరనారాయణుడి రూపములో ఈ కల్పం పూర్తయియ్యేంత వరకు కూడా భరత వర్షంలో సద్గుణములతో తపశ్శక్తి చేత అవ్యక్తులై గోచరిస్తూ ఉంటారు.

49.భరతవర్షములో ఉన్న కొన్ని పవిత్రమైన పర్వతములు?
జ. మలయము, మైనాకము, ఋష్యమూకం, శ్రీశైలము, చిత్రకూటము, వింధ్య, గోవర్ధనము, ఇంద్రకీలకము, వేంకటము. మొదలైనవి.

50. భరత వర్షములో ఉన్నకొన్ని నదులు పేర్లు?
జ. చంద్రావతి, తామ్రపర్ణి, కావేరి, తుంగ భద్ర, గోదావరి, నిర్వింధ్య, తాపీ, రేవ, సురస, నర్మదా, వేదస్మృతి, త్రిసామ, కౌశికి, యమున, బ్రహ్మపుత్ర మొదలైనవి.

51. భరత వర్షం యొక్క విశేషం ఏమిటి?
జ. ఇక్కడ పుట్టినటువంటి వారు అనేక జన్మలనుంచి వెంటాడుతున్నటువంటి అజ్ఞానాన్ని వారి వారి వర్ణాశ్రమ ధర్మాలననుసరించి నడిస్తే చాలు అజ్ఞానం నుంచి బయట పడతారు. ఆ సౌలభ్యం ఇక్కడ ఉన్నది.

52. యజ్ఞము ద్వారా ఏమి చేయవచ్చు?
జ. భగవంతుని అర్థించవచ్చు, అర్చించవచ్చు.

## భగవన్నామ స్మరణము - అజామిళుడి కథ

53. ప్రవృత్తి మార్గం అనగా ఏమిటి?
జ. ఫల ఆశతో కర్మను చేసే వారి స్థితి. వీరు చేసిన కర్మను బట్టి వివిధ లోకాలలో సంచరిస్తూ అక్కడ సుఖాలను అనుభవిస్తూ తిరిగి భూమిమీదకు వస్తుంటారు.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose



54. మానవుల గతులన్నీ మూడు మార్గాలుగా చెప్పాడు శుక మహర్షి, అవి ఏమిటి?
జ. నివృత్తి మార్గం, ప్రవృత్తి మార్గం, పాప మార్గం.

55.చిత్తాన్ని శుద్ధి చేసుకోవటానికి భగవంతుడు ఇచ్చిన అవకాశం ఏమిటి?
జ. మానవ జన్మ.

56. శుక యోగీంద్రుడు జీవన విధానం గురించి చెప్పిన నియమాలు ఏమిటి?
జ. తపస్సు, బ్రహ్మచర్యము, శమము, దమము, త్యాగము, సత్యము,శౌచము,యమము మరియు నియమము; బయటి సంఘటనలకి చలించకుండుట, ధర్మము, శాస్త్రవిషయముల యందు విశ్వాసము.

57.జీవన నియమములు పాటించినచో ఏమవుతుంది?
జ. సూర్యోదయం వచ్చినప్పుడు పొగ మంచు ఎలా పోతుందో అలాగే ఈ నియమాలు పాటించినప్పుడు మన పాపములు అలా తగలపడి పోతాయి.

58.కాని పై నియమములు పాటించటానికి ఒక్కోసారి అనుకూలం కాకపోవచ్చు మరియు పాపములు అన్ని పూర్తిగా పోగొట్టడానికి అవి సరిపోకవచ్చు. అప్పుడు ఏమి చేయాలి?
జ. భగవన్నామ స్మరణం చేయాలి.

59.ధ్యాన యోగము, కర్మ యోగము మరియు ఇతర యోగములలో అన్నింటికంటే గొప్ప యోగం ఏమిటి?
జ. నామ స్మరణ యోగము.

60. భక్తి లేనివాడు ఎన్ని ప్రాయశ్చిత్త కర్మలు చేసిన వాడు శుద్ధి అవుతాడా?
జ. కాదు. శుద్ధి కానంత వరకు సిద్ధి ఉండదు.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

61.శుద్ధి ఎవరి కర్తవ్యం? సిద్ధి ఎవరి కర్తవ్యం?

జ. శుద్ధి మనిషి కర్తవ్యం. సిద్ధి పరమేశ్వరుడి దయ.

62. అజామీళుడి కథ శుక యోగులకు ఎవ్వరు చెప్పారు?

జ. అగస్త్య మహా ముని.

63.అజామీళుడికి ఎంత మంది సంతానం? వారిలో అతనికి ప్రియమైన సంతానం ఎవరు?

జ. పది మంది సంతానం. పదవ సంతానం అతనికి ప్రియమయిన వాడు. అతని పేరు నారాయణుడు.



64. భగవన్నామ స్మరణ ఎప్పటి వరకు చేయాలి?

జ. మరణం వరకు.

65. అజామీళుడు చనిపోతున్నప్పుడు అతనికి ఎవరు కనిపించారు ?

జ. ముగ్గురు యమ కింకరులు కనిపించారు.

66.యమ కింకరులను చూసి అజామీళుడు ఏమి చేసాడు?

జ. తన ప్రియమైన కుమారుడైన నారాయణుడి పేరు స్మరించాడు.

67. అజామీళుడు చనిపోతున్న సమయం లో తన ప్రియమైన కుమారుడైన నారాయణుడి పేరు స్మరించాక ఎవరు వచ్చారు?

జ. క్షణంలో విష్ణు దూతలు అక్కడకి వచ్చారు.

## ఇంద్రునికి బ్రహ్మహత్యా పాతకం కలుగుట మరియు వృత్రాసురుని జన్మ

68.అనుస్మర అంటే ఏమిటి?

జ. భగవంతుని ఎల్లవేళలా, ఏ పని చేస్తున్నా స్మరిస్తూ ఉండటం.

69. అనసూయ అంటే ఏమిటి?
జ. ఎవరైతే ఇతరులలో దోషము చూడరో వారిని అనసూయః అని అంటారు.

70. అన్నింటికన్నా గొప్ప బలం ఏది?
జ. ధర్మబలం.

71.ఎలాంటి వారికి అమంగళములు రావు?
జ. ఎవరైతే గోవిందుని, గోవులను, వేదవేత్తలను గౌరవిస్తారో అలాంటి వారికి అమంగళములు రావు.

72. గురువులను ధిక్కరించడం ఎవరి లక్షణం?
జ. అసుర లక్షణం.

73.అవిద్య అంటే ఏమిటి?
జ. తాను కాని దానిని తాననుకొనుట. తానేమిటో తెలుసుకోలేక పోవుట.



74. విశ్వరూపుడు ఇంద్రునికి ఏ విద్య ఇచ్చెను?
జ. "నారాయణ కవచం" అనే అద్భుతమైన విద్యను ఇచ్చెను.

75. నిజమైన ప్రాయశ్చిత్తం ఎలా జరుగుతుంది?
జ. భగవన్నామ స్మరణ వల్ల.

76.శ్రుత సంపన్నుడు అనగా ఎవరు?
జ. శాస్త్ర జ్ఞానం పుష్టిగా ఉన్నవాడిని శ్రుతసంపన్నుడు అంటారు.

77.దాంతుడు అంటే ఎవరు?
జ. ఇంద్రియ నిగ్రహం ఉన్నవాడు.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose



78. ఇంద్రునికి బ్రహ్మ హత్యా పాతకం ఎందువల్ల వచ్చింది?
జ. విశ్వరూపుని చంపడం వల్ల.

79.ఇంద్రుని బ్రహ్మహత్యా పాతకాన్ని పంచుకున్నది ఎవరు?
జ. భూమి, నీరు, చెట్టు, మరియు స్త్రీ.

80. ఆ పాతకం వారి నలుగురి లో ఎలా కనిపిస్తుంది?
జ. 1.భూమి - ఊషర క్షేత్రాల్లో, చవిటి నేలల్లో 2.నీరు - నురగగా 3.చెట్టు – జిగురు, 4. స్త్రీ - రజస్వల దోషం.

81.ఇంద్ర పాతకం, ఆ నలుగురి (భూమి, చెట్టు, నీరు, స్త్రీ) మీద ప్రభావం వైజ్ఞానికంగా ఎలా వివరించవచ్చు?
జ. ఇంద్ర అనేది వేదం పరంగా సూర్యుని ఒకానొక తేజస్సు. ద్వాదశాదిత్యుల్లో ఇంద్రుడొకడు. సూర్యుని నుంచి ఇంద్రనామక కిరణములు తీక్షణముగా ఉంటాయి. భూమి కి వస్తూ రక రకాల ప్రాకృత దుష్ట శక్తుల్ని ఛేదిస్తూ వస్తాయి. ఆ దుష్ట శక్తులు తిరిగి reflect అయ్యినప్పుడు భూమిపై నాలుగు వస్తువుల (భూమి, చెట్టు, నీరు, స్త్రీ) మీద ప్రభావం చూపిస్తాయి.

82. అంతఃకరణ శుద్ధికి మార్గం ఏమిటి?
జ. భగవన్నామ స్మరణయే మార్గం.

83. యముడు తన దూతలను ఎవరి దగ్గరకు వెళ్ళవద్దని శాసించాడు?
జ. ఎవరైతే పరమేశ్వరుని నామము నాలుకతో పలుకుతారో, మనస్సుతో స్మరిస్తారో, శరీరంతో నమస్కరిస్తారో (అంటే త్రికరణాలతో), అట్టి వారి దగ్గరకు వెళ్ళవద్దని శాసించాడు.

84.విశ్వరూపుడి తండ్రి ఎవరు?
జ. త్వష్ట ప్రజాపతి.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

85. పురుషుడు ఈ కింద సూచించిన వారి పట్ల ఎలా గౌరవించాలి?
జ. ఆచార్యుడు - వేదము యొక్క మూర్తి
తండ్రి - బ్రహ్మ యొక్క మూర్తి
అన్న - ఇంద్రుని యొక్క మూర్తి
తల్లి - భూదేవి యొక్క మూర్తి
సోదరి - దయ యొక్క మూర్తి
అతిధి - ధర్మం యొక్క మూర్తి
అభ్యాగతుడు - అగ్ని యొక్క మూర్తి
సకల ప్రాణులు - ఆత్మ యొక్క మూర్తులు.

86. త్వష్ట ప్రజాపతి చేసిన హోమం నుంచి ఉద్భవించిన మహాపురుషుడు పేరేమిటి?
జ. వృత్రాసురుడు.

87. మనిషికి అవిద్య, కామం, కర్మ ఏ ప్రకారం కలుగుతాయి?
జ. అవిద్య వల్ల కామం. కామం వల్ల కర్మ. కర్మ వల్ల మళ్లీ అవిద్య.

## వృత్రాసురుడు

88. విశ్వరూపుడు సంహరింపబడినప్పుడు త్వష్ట ప్రజాపతి ఎందుకు నిలదీయలేక పోయాడు?
జ. ఎందుకంటే అది ధర్మ ప్రకారం జరిగింది కనుక.



89. త్వష్ట ప్రజాపతి ప్రతీకార వాంఛతో ఏమి చేశాడు?
జ. దక్షిణాగ్ని వైపు అభిచార హోమం చేసెను.

90. హోమం నుండి ఎవరు ఆవిర్భవించారు?
జ. వృత్రాసురుడు.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

91.త్వష్ట ప్రజాపతి చేసిన పొరపాటు ఏమిటి?
జ. ఇంద్ర సంహారకుడైన శత్రువు రావాలి అనే మంత్రం చెప్పబోతుంటే స్వరలోపం వలన ఇంద్రునిచేత సహరింపబడే వాడు రావాలి అనే విధంగా అర్థం మారిపోయింది.

92.ఇంద్రాది దేవతలు ఎవరిని ఆశ్రయించారు?
జ. విష్ణువుని.

93.విష్ణుతత్త్వాన్ని ఎన్ని రకాలుగా విభజించవచ్చు? అవి ఏవి?
జ. 3 రకాలు. స్వరూప లక్షణము. తటస్థ లక్షణము. లీలా స్వరూపము.

94. స్వరూప లక్షణం ఏమిటి?
జ. జగత్తుని మినహాయించి జగన్నాధుని అసలు స్వరూపం తెలుసుకుంటే, అది స్వరూప లక్షణం.

95. తటస్థ లక్షణం ఏమిటి?
జ. జగత్తుని పట్టుకుని, విష్ణువుని తెలుసుకోవటానికి ప్రయత్నిస్తే, అది తటస్థలక్షణం.


96. లీలా స్వరూపం ఏమిటి?
జ. జగత్తులో ఆయా దేశకాలాల అవసరాలను అనుసరించి అవతరిస్తాడు. అదే లీలాస్వరూపం.

97.మోక్షం అనగా ఏమిటి?
జ. భగవంతుని లీలాచరిత్రను ఆస్వాదిస్తూ, తటస్థస్వరూప లక్షణాలను అవగాహన చేసుకుంటూ, క్రమంగా ఆయన స్వరూపమే స్వస్వరూపమని గ్రహించడమే మోక్షం.

98.తర్కము ఎన్ని రకములు? అవి ఏవి?
జ. 2 రకములు. 1) ఆభాసము. అనగా తర్కంలా కనబడుతుంది. కానీ కాదు. 2) కుతర్కము, అనగా కూడని తర్కము.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

99. ఉపాసకుడు ఎప్పుడు ఎవరిని ఉపాసించాలి?
జ. మాయశబళిత బ్రహ్మను.




100. పరమ భాగవతులని ఏమంటారు?
జ. ఏకాంతులు అంటారు.

101.భక్తి ఎన్ని రకాలు?
జ. 2 రకాలు. గౌణ భక్తి. ముఖ్య భక్తి.

102.భగవంతుని కీర్తి ఎటువంటిది?
జ. ఉజ్వలమైనది. తీయనిది.

103. ఏకాంత భక్తులు ఏమి కోరుకుంటారు?
జ. అన్ని కోరికలు వదిలి, భగవంతుడే కావాలని కోరుకుంటారు.

104.దధీచి మహర్షి ఎక్కడినుండి ఉద్భవించారు ?
జ. బ్రహ్మదేవుని యొక్క అంగముల నుంచి.



105. దధీచికి వేరే పేర్లు ఏమి?
జ. దధ్యంగ ఋషి, ఆంగిరసుడు.


106.అధర్వణ వేదమునకు ఇతర పేర్లు ఏమి?
జ. సిద్ధవేదము, వైషద్య వేదము.

107.దధీచి శరీరము ఎటువంటిది?
జ. విద్య, వ్రత, తపస్సుల సారము.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

108.దధీచి మహర్షి ఎముకలతో తయారు చేసిన ఆయుధం పేరేమిటి?

జ. వజ్రాయుధం.



109.ఇంద్రుడు, వృత్రాసురుడు చేసిన సంవాదం పేరేమిటి?

జ. వృత్రాసుర వీరవాణి.

110.యుద్ధము ఎప్పుడు ఎక్కడ జరిగింది?

జ. మొదటి మహాయుగంలోని, త్రేతాయుగంలో నర్మదా తీరంలో జరిగింది.

111.సిద్ధి అనగా ఏమి?

జ. మాయని జయించుట.

112.ఎవరు జనన మరణ వృత్తాన్ని జయించగలరు?

జ. భక్తితో చేసిన యోగం ఎవరి దగ్గర ఉంటుందో వారు జయించగలరు.

113.వృత్రాసురుడి కథని శ్రద్ధాభక్తులతో వినటం వల్ల భక్తులకు ఏమి లభిస్తుంది?

జ. ఇంద్రియాలకు బలము, ధనము, శత్రువులపై జయం, ఆయుర్వృద్ధి లభిస్తుంది.

## చిత్రకేతోపాఖ్యానం

114.సంకర్షణ విద్య అంటే ఏమి?

జ. సమ్యక్ కర్షణం సంకర్షణం; సర్వ లోకాలను గ్రసించే విష్ణు స్వరూపం.

115. వృత్రాసురుడు ఎలా ఉద్భవించాడు?

జ. యజ్ఞం నుండి.

116. వృత్రాసురుడు పూర్వ జన్మ లో ఎవరు?
జ. చిత్రకేత మహారాజు.

117.శాపం అంటే ఏమి?
జ. పూర్వ కర్మలని అనుసరించి జరగబోయేది చెప్పే సూచన.

118. విద్యాధర చక్రవర్తి ద్వేష భావం వలన వచ్చిన దేహం ఏది?
జ. దనుజ దేహం.

119. చిత్రకేతు మహారాజు నిరంతర సంకర్షణ స్మరణ ఫలితంగా వచ్చింది ఏమి ?
జ. దివ్యత్వం.



120. స్మృతి అంటే ఏమి?
జ. నిరంతర చింతన / సాధన.

121. సాత్వికులు ఎవరు?
జ. దేవతలు / ఋషులు.
122. రాజసులు ఎవరు?
జ. అసురులు.

123. తామసులు ఎవరు?
జ. యక్ష / రాక్షసులు.

124.చిత్రకేతు మహారాజు పట్టపురాణి ఎవరు?
జ. కృతద్యుతి.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose


# ప్రహ్లాద చరిత్ర - సహజ భక్తి

125.వృత్రాసురుని సంహార కథ ద్వారా, వ్యాస భగవానులు మనకి ఏమిటి తెలియ చేసారు?
జ. వృత్రాసురుని భక్తి యోగము యొక్క లక్షణం ద్వారా భాగవత ధర్మాన్ని మనకి తెలియచేసారు.

126. శుక యోగీంద్రులు, వృత్రాసురుడు భక్తి నిష్ఠ గురించి మనకి ఏమి తెలియ చేసారు?
జ. భక్తి నిష్ఠ లో వుంటూ, స్వధర్మాన్ని ఎలా పాటించాడో చెప్తూ, భక్తి యోగం యొక్క స్వరూపాన్ని అందించారు.

127. ప్రహ్లాద చరిత్ర భాగవతంలో ఏ స్థానంలో వుంది?
జ. ప్రహ్లాద చరిత్ర భాగవతంలో, హృదయ స్థానంలో, ఏడవ స్కందంగా వస్తుంది.

128. ప్రహ్లాద చరిత్ర లో, భాగవతం మనకి, ఎలాంటి భక్తి గురుంచి తెలియచేసింది?
జ. స్వభావ భక్తి గురుంచి తెలియచేసింది.



129. భక్తులు ఎన్ని రకాలుగా వుంటారు?
జ. భక్తులు 4 రకాలు గా వుంటారు: 1. ఆర్త భక్తులు, 2. జిజ్ఞాస భక్తులు,
3. అర్ధార్ధ భక్తులు , 4. జ్ఞాన భక్తులు నలుగురూ పుణ్యాత్ములు.

130.జిజ్ఞాస భక్తులు ఎలా వుంటారు?
జ. జిజ్ఞాస భక్తులు భగవంతుని గురించి తెలుసుకోవాలనే తపన వున్న వాళ్ళు- ఉద్ధవుడు ఈ కోవలోకి వస్తాడు.

131. అర్ధార్ధ భక్తులు ఎలా వుంటారు?
జ. అర్ధార్ధులు భగవంతుడి దర్శన ప్రాప్తి లో ప్రయోజనం ఆశించే వాళ్ళు. అంటే, ఆ పరమాత్మ ద్వారా మోక్షం పొందాలనే తపన వున్నవాళ్లు- ధృవుడు వీరి కోవకి వస్తాడు.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

132.జ్ఞాన భక్తులు ఎలా వుంటారు?

జ. జ్ఞాన భక్తులు నిత్యం భగవంతుని తో ఐక్యమై ఉండి, అయన తో కలసి తాదాత్మ్యంతో వుంటారు - ప్రహ్లాదుడు ఈ కోవకి చెందిన భక్తుడు.

133. జ్ఞాన భక్తి స్థితి కి చేరుకోవాలంటే మొదట ఏమిటి అవసరం?

జ. ప్రధమంగా, మనకి ఆ భగవంతుని మీద ప్రీతి, ఆర్తి కలిగి ఉండాలి, అలా ప్రీతి కలిగిన వాళ్ళకి, జిజ్ఞాస, క్రమంగా జ్ఞాన భక్తి కలిగి మోక్షం కలుగుతుంది.

134. భక్తిలో ఎవరిని ఆదర్శంగా తీసుకోవాలి?

జ. భక్తిలో పరిపూర్ణులని ఆదర్శంగా తీసుకోవాలి ధృవుడు, మార్కండేయుడు, ప్రహ్లాదుడు, ఉపమన్యువు ఆదర్శంగా తీసుకోదగిన వారు.

135. హిరణ్యకశిపుడు వేటి కోసం తపస్సు చేసాడు?

జ. హిరణ్యకశిపుడు అజరత్వ, అమరత్వాల కోసం తపస్సు చేసాడు.

136.అజరత్వ, అమరత్వాలు ఎలాంటి కోరికలు?

జ. అజరత్వ, అమరత్వాలు ప్రకృతి విరుద్ధమైన కోరికలు.

137. హిరణ్యకశిపుని తపస్సుకి ఎవరు ప్రత్యక్షమయ్యారు?

జ. బ్రహ్మ దేవుడు.

138. హిరణ్యకశిపుని తపస్సుకి బ్రహ్మ దేవుడు ఎందుకు ప్రత్యక్షమయ్యారు?

జ. కఠోరమైన నియమపాలన చేస్తూ, అకుంఠితమైన దీక్షతో తనని తాను తపింప చేసుకుంటే, సృష్టి విధాన కర్తకి కటాక్షించే బాధ్యత ఉంటుంది.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

139.హిరణ్యకశిపుడు కోరిన వరం ఏమిటి?

జ. ద్వంద్వములలో మరణం లేకుండా ఉండడానికి, రకరకాల కారణాల వల్ల మరణం లేకుండా వరం అడిగాడు.

140. ద్వంద్వములలో మరణిస్తే ఏమవుతుంది?

జ. ద్వంద్వములలో మరణిస్తే మళ్ళీ, ఆ ద్వంద్వంలోనే పడతారు. ద్వంద్వాతీత స్థితి ఏమైతే ఉందో అందులో తనువు త్యాగం చెయ్యగలగాలి.

141. హిరణ్యకశిపుని భార్య పేరు ఏమిటి? ఆమె ఎవరి కూతురు?

జ. కయాదువు. ఆమె జంభాసురుడనే రాక్షసుని కుమార్తె.

142.హిరణ్యకశిపుని కుమారులు ఎందరు? వారి పేర్లు ఏమిటి?

జ. నలుగురు కుమారులు. హ్లాదుడు, సంహ్లాదుడు, అనుహ్లాదుడు, ప్రహ్లాదుడు.

143. పతంజలి యోగ శాస్త్రం లో యోగ అధ్యయనం చేసే వారికి ఉండవలసిన లక్షణాలు ఏమిటని చెప్పారు?

జ. ఎవరి పట్ల స్నేహ భావం, ఎవరి పట్ల ముదిత భావం, ఎవరి పట్ల కరుణ, ఉపేక్ష ఉండాలో పతంజలి యోగ శాస్త్రంలో వివరించారు. ఇవన్నీ ప్రహ్లాదుని సహజ లక్షణాలు.

144. బ్రహ్మణ్యుడు అంటే ఎవరు?

జ. బ్రహ్మం యెడల ప్రీతి కలవాడు. బ్రహ్మముని కాపాడు వాడు.

145.బ్రహ్మం అనగా ఏమిటి?

జ. బ్రహ్మం అనగా వేదము, ధర్మము, తపస్సు, జ్ఞానము మరియు పరమాత్మ.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

146.ప్రహ్లాదుని భక్తి లక్షణాలు కొన్ని వివరించండి ?
జ. బ్రహ్మణ్యుడు, శీల సంపన్నుడు, సత్య సంధుడు, జితేంద్రియుడు, సర్వ భూతములని ఆత్మవలే సమానంగా భావించు వాడు.

147. నైసర్గికీ రతి అంటే ఏమిటి?
జ. సహజ రతి, సహజ భక్తి, స్వభావ భక్తి.

148. కృష్ణగ్రహ గృహీతాత్మ అంటే ఏమిటి? అది ఎవరిని ఉద్దేశించి చెప్పారు?
జ. కృష్ణ గ్రహంతో తాదాత్మ్యం పొందుతూ, కృష్ణ భూతం పట్టిన వాడిలా వుండే వాడు అని ప్రహ్లాదుని గురించి చెప్పారు.

149.భోగ భూమి అని దేనిని అంటారు?
జ. భగవంతుని రూపం వూహించగానే ఆనందాశ్రువులు రావాలి, అయన నామాన్ని జపిస్తే, గొంతు బొంగురు పోవాలి, అయన పేరు విన గానే వొళ్ళంతా పులకించి పోవాలి. ఇలాంటి స్థితి అనుభవించే దేహముని భోగ భూమి అంటారు.

150. ప్రహ్లాదుని భగవద్భావన ఎలా ఉండేది?
జ. బహిర్ముఖ, అంతర్ముఖ స్థితిలలో పరమాత్మతో తాదాత్మ్యం చెందేవాడు.

151. ప్రహ్లాదుని చూసి, హిరణ్య కశిపుడు అతడు ఎలాంటి వాడని అనుకునే వాడు?
జ. ఒక జడుడూ, ఉన్మత్తుడు అనుకునేవాడు.

152. ప్రహ్లాదుని ఏ గురుకులంలో జేర్పించారు?
జ. శుక్రాచార్యుల పుత్రులైన చండామార్కుల వద్ద జేర్పించారు.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

153. శుకయోగీంద్రులు ప్రహ్లాదుని ఏవిధంగా వర్ణించారు?
జ. నయకోవిదుడైన బాలుడని వర్ణించారు.

154. నయం అనగానేమి?
జ. నయం అనగా నీతి, ధర్మం, శాస్త్రం, సత్యం.

## ప్రహ్లాద భాగవత ధర్మ బోధిని

155. ప్రహ్లాదుడు విద్యలను ఎలా అభ్యసించాడు?
జ. విష్ణువుని యందు బుద్ధి స్థిరముగా నిలిపి , గురువుల వద్ద వినయంగా ఆలకించి, పఠించెను.

156.హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడుని ఏమని అడిగెను?
జ. పుత్రా! నీకు ఏది భద్రం అయివున్నదో చెప్పు.

157. ప్రహ్లాదుడు భద్రం/సాధు మార్గం ఏది అని పల్కెను?
జ. అసత్యాన్ని సత్యం అనుకోని గృహం అనే అంధకూపంలో తిరిగేవారు సత్పురుషులను ఆశ్రయించి, ఏకాంతం తో పరమాత్మను శరణు వేడి తరించటమే సాధు మార్గం.

158. అసలు వేరు అను భావం దేని వలన వస్తుంది?
జ. అవివేకం వలన. దీనికి పశు బుద్ధి అని పేరు.

159. అనుగ్రహం అంటే ఏమిటి?
జ. విశ్వం అంతటా వ్యాపించి ఉన్నవాడిని గ్రహించటమే అనుగ్రహం.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

160. ప్రహ్లాదునికి భగవంతునిపై వున్న ఆకర్షణ ఏమిటి?

జ. సహజాకర్షణ/ సహజ భక్తి. ఇదే ప్రేమ జనిత వైరాగ్యం.

161. వివేక జనిత వైరాగ్యం అంటే ఏమిటి ?

జ. సార, నిస్సార వస్తు విశ్లేషణ చేసి పొందే వైరాగ్యం.

162. విష్ణువు, ప్రహ్లాదుడు రాక్షస వంశానికి ఎలాంటివారు?

జ. రాక్షస వంశం అనే అరణ్యానికి విష్ణువు గొడ్డలి వంటివాడు, ప్రహ్లాదుడు గొడ్డలి పిడి వంటివాడు.

163. ప్రహ్లాదుని గుణాలు ఏమిటి?

జ. వినయం,కారుణ్యం,బుద్ధి వివేక లక్షణం కలిగి వున్నాడు .

164. విష్ణు భక్తుని యందు సద్గుణాలు సహజంగా ఉంటాయి. ఎందుకు?

జ. సద్గుణాలు లేనిదే విష్ణువు దొరకడు. విష్ణువు దొరికితే సద్గుణాలు వదలవు.




165. భక్తి లక్షణాలు ఎన్ని?

జ. భక్తి లక్షణాలు 9.

166.మహాసాధన అంటే ఏమిటి?

జ. శ్రవణం-కీర్తనం -స్మరణం.

(త్రికరణ సాధన).

167. వందనం ఎలాంటిది?

జ. ఆత్మ యజ్ఞం వంటిది.

168. దాస్యం అంటే ఏమిటి?
జ. అహంకారాన్ని అణచి ప్రవర్తించటం.

169. ఆత్మ నివేదనం అంటే ఏమిటి?
జ. నేను అన్న భావాన్ని భగవదర్పణ చేయడం .

170.భక్తి అంటే ఏమిటి?
జ. ఏ ఇంద్రియాలకు ప్రపంచ విషయాలను అనుభవించుటకు వాడుతున్నామో, ఆ ఇంద్రియాలను పరామాత్మకు వినియోగించటం.

171. క్షేత్రములు ఎందుకు?
జ. పాదాలు ప్రదక్షిణ చేసి పవిత్రం కావటానికి. పాదాలు ఆధారంగా వున్న శరీరం పవిత్రం కావటానికి.

172. ఎలాంటి వారికి హరి జ్ఞానం రాదు?
జ. అజ్ఞానంతో ఎప్పుడూ ఇంద్రియ విషయాలలో ఉన్నవారికి , చచ్చుచు పుడుతూ అలా తిన్నదే మరల తినువారికి, ఇతరులు చెప్పినా, ఏదైనా ఇచ్చినా, ఇలాంటి వారు అడవులకు వెళ్లినా హరి జ్ఞానం రాదు.

173.అవిద్య దాటాలన్నా, అవిద్యలో వున్న సంసారాన్ని దాటాలన్నా మార్గం ఏమిటి?
జ. బుద్ధిని త్రివిక్రముడైన విష్ణువుకు అప్పగించటం తప్ప మరోమార్గం లేదు.

174. ఏది పరమార్ధం?
జ. అర్ధం అవుతున్న సంసారం "అనర్ధం".
అది మనకు అనిపించకపోవటం "అపార్ధం".
పరమాత్మ ఒక్కడే "పరమార్ధం".

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

# ప్రహ్లాద తత్త్వం, నారసింహ ఆవిర్భావం/తత్త్వం

175.ప్రహ్లాదుని రాక్షసులు ఎంత హింసించడానికి ప్రయత్నించినా ఆయన్ని ఎందుకు ఏమీ చేయలేకపోతున్నారు ?
జ. సర్వం విష్ణుమయం అనే భావంలో ఉన్నవారిని సర్వత్రా ఉన్న విష్ణువే రక్షించుకుంటాడు.

176.అభిచారిక క్రియలు చెయ్యడం వల్ల కలిగిన కృత్య ఏమి చేసింది ?
జ. ప్రహ్లాదుని వక్షస్థలంపై త్రిశూలం ప్రయోగించింది, ఆయన్ని ఏమిచెయ్యలేక ప్రయోగించిన వారిపైకి వెళ్ళింది.

177. ప్రహ్లాదునికి ఎందువల్ల భగవంతుని పైన నమ్మకం లేదు?
జ. ఆయనది అనుభవం. అనుభవం ఉన్నచోట నమ్మకాలతో పని లేదు.

178. నీటినుండి అగ్నిలోకి/ఒక దగ్గర నించి ఇంకో దగ్గరకి పడేస్తున్నప్పుడు ప్రహ్లాదునికి ఏమి అనిపించింది ?
జ. అమ్మ ఒక తొడ నుండి ఇంకో తొడ పైకి పిల్లాడిని మార్చినట్లు. విష్ణువు నుండి విష్ణువుకే వెళ్తున్నట్లు అనిపించింది.

179. భక్తులు భగవంతుని స్మరించడం ఎలాంటిది అని పోల్చారు ?
జ. మనం ఊపిరి తీయడం ఎంత సాధారణంగా చేస్తామో అంత సాధారణంగా భక్తుడు భగవంతుని స్మరణలో ఉంటాడు.

180. ఎంత శిక్షించినా చలించని ప్రహ్లాదుని చూసి తండ్రి హిరణ్యకశిపుడు ఏమనుకున్నాడు ?
జ. ఆశ్చర్యపోయి, బహుశా అతని చావు ప్రహ్లాదుడి ద్వారానే రాసిపెట్టుందేమో అనుకున్నాడు.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

181. తిరిగి ప్రహ్లాదుని గురుకులానికి తీసుకువెళ్లి మార్చుదాం అనుకున్న చండామార్కులకి హిరణ్యకశిపుడు ఏమి చెప్పి పంపాడు?
జ. బంధించి అయినాసరే బుద్ధి మార్చమని, త్రివర్గ పాఠం (అర్ధం, కామం, వాటిని సంపాదించుకోడానికి ధర్మం) మాత్రమే చెప్పమని పంపాడు.

182. గురుకులానికి వెళ్లిన ప్రహ్లాదుడు గురువులు బయటకి వెళ్ళినప్పుడు ఏమి చేసాడు ?
జ. ఇతర అసుర బాలురకు భాగవత ధర్మాలను బోధించడం మొదలుపెట్టాడు.

183. ప్రహ్లాదుడు బాలకులకు భాగవత ధర్మాలు ఉపదేశించడం నుండి తెలుసుకోవలసింది ఏమిటి ?
జ. భాగవత ధర్మాలు తెలుసుకోవలసినది పాటించవలసినది ఎప్పుడో వృద్ధాప్యం వచ్చాక కాదు, కౌమారం నుండి చెయ్యవలసినది.

184. మొట్టమొదటగా ప్రహ్లాదుడు అసుర బాలురకు ఏమిటి ?
జ. నిత్యం సన్నిహితో మృత్యు కర్తవ్యో ధర్మ సంగ్రహః - అంటే మృత్యువు పక్కనే ఉంది అని జాగ్రత్త పడుతూ ధర్మం పరిపూర్ణంగా ఆచరించే ప్రయత్నం చెయ్యాలి.

185. అతి దుర్లభం అయినా మనుష్య జన్మకి సార్ధకం ఏమిటి ?
జ. భగవంతుడి పాదములను ఆశ్రయించడం మాత్రమే.

186. మనం ఆశ్రయించవలసిన భగవంతుడు ఎవరు ?
జ. 1) సర్వభూతమూలకు నిజమైన ప్రియమైన వాడు 2) జీవులందరికి ఆత్మయై ఉన్నవాడు 3) సర్వ జీవ నియామకుడు (ఈశ్వరుడు) 4) సుహృత్తు - హితకారి, నిజమైన స్నేహితుడు.

187. ప్రపంచం అనే లంపటంలో పడి మనం రెండు ముఖ్యమైన విషయాలు గమనించడంలేదు అవి ఏమిటి ?
జ. 1) ఆయుష్షు వ్యర్ధమవుతుంది అని 2) పురుషార్ధం భంగం అవుతున్నది అని (శాశ్వత ప్రయోజనానికి దూరం అవుతున్నాం అని).

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

188. వివిధ వ్యవస్థల్లో జీవితాన్ని ఎలా వ్యర్థం చేసుకుంటున్నాం ?

జ. బాల్య అవస్థలో - క్రీడలు; యవ్వనంలో - భోగాలు/కామవికారాలు; వృద్ధాప్యంలో – చింతలతో.

189. అజ్ఞానం జబ్బులో పడి మనం గమనించని రెండు విషయాలు ఏమిటి ?

జ. 1) ఆయుష్షు కరిగిపోతోంది అని 2) శాశ్వత ప్రయోజనం/మనం దేనికి వచ్చామో అది దెబ్బతింటోంది అని.

190.మానవుడు సాధన దశలో ప్రయత్నపూర్వకంగా చెయ్యవలసినది ఏమిటి ?

జ. దుస్సంగాన్ని విడిచి సత్సంగాన్ని పట్టుకుని నారాయణుని పాదాలని ఆశ్రయించాలి.

191. పరమాత్మని ఆశ్రయించడం ఎందుకు సులభం ?

జ. పరమాత్మ 1) సిద్ధత్వాత్ - ఎప్పుడూ ఉండే వాడు అందుకు ఆయన్ని తెచ్చుకోవడం ఎప్పుడూ పోదు; 2) ఆత్మత్త్వాత్ - సర్వ జీవులకు ఆత్మయై ("నేను" గా) ఉన్నవాడు.

192. భగవంతుడి స్వరూపం ఏమిటి ?

జ. అనేకంలో ఏకంగా, అతీతంగా ఉన్నటువంటివాడు, ప్రత్యగాత్మగా సర్వ జీవులలో ఉన్నటువంటివాడు, కేవలం అనుభవ ఆనంద స్వరూపుడు.

193.భాగవత ధర్మంలో ప్రధాన ధర్మం ఏమిటి ?

జ. దయ/అహింస; నీలో ఎలా అయితే పరమాత్మ ఉన్నాడో, అన్నిటియందు అలానే ఉన్నాడు కావున ఇతరులయందు, తనయందు స్వ, పర భేద దృష్టి ఉండరాదు.

194.త్రిగుణాతీత విద్య అని దేన్ని అంటారు ?

జ. త్రిగుణాతీతం అయిన అంతర్యామిని ఆశ్రయించమని చెప్పే విద్య.

195.త్రిగుణాతీత విద్య పొందడానికి అర్హత ఏమిటి ?

జ. ఏకాంతిక/అనన్య భక్తి కావాలి అనుకోవడం.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose



196. ఏకాంతిక భక్తి కావాలి అనుకున్నవారికి అది ఎలా లభిస్తుంది?
జ. అనన్య భక్తుల పాదాలు పట్టుకుంటే లభిస్తుంది.

197.ఐకాంతిక భక్తి ధర్మం ఎవరు ఎవరికి బోధించారు ?
జ. నర నారాయణులలో నారాయణుడు నారదులవారికి.

198. ప్రహ్లాదుడికి భాగవత ధర్మం ఎవరు బోధించారు ?
జ. నారదులవారు.

199. హిరణ్యకశిపునికి కలగబోయే సంతానాన్ని సంహరించడానికి, అతని భార్యని ఇంద్రుడు బంధించి తీసుకువెళుతూ ఉండగా నారద మహర్షి ఇంద్రునితో ఏమి పలికారు ?
జ. లోకాలని ఉద్ధరించేవాడు పుట్టబోతున్నాడు, పుట్టేవాడు సామాన్యుడు కాదు, నిర్భీకుడు, ఏ దోషమూ లేని వాడు, భక్తుడు, గొప్పవాడు, శ్రీహరి సేవకుడు అని పలికారు.

200.మనకి ఇంకా ఆయుష్షు ఉంది అంటే అర్థం ఏమిటి ?
జ. భగవంతుడు మనకి బాగుపడడానికి ఇచ్చిన అవకాశమే ఆయుష్షు.

201. ఆత్మని ఎక్కడ వెతకాలి?
జ. ఇక్కడే వెతకాలి. చచ్చాక దొరికేదానికంటే, బుద్ధి ఉపయోగిస్తే ఇక్కడ పొందేది స్వర్గాదులకంటే గొప్పది. పొందాల్సింది ఇక్కడే ఉందని చెప్పే ఏకైక మతం హిందూ మతం.

202. భగవంతుని వివిధ విధములుగా ఆరాధించేటప్పుడు గుర్తు పెట్టుకోవలసినది ఏమిటి ?
జ. విగ్రహం యందు ఎంత ఆరాధిస్తున్నావో "సర్వం యందు కలిగి ఉన్నాడు" అన్న భావం అంత ఉండాలి.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

203. మన ఆధ్యాత్మిక సాధనకి కొలబద్ద ఏమిటి ?
జ. సాధన చేస్తూ ఉండగా క్రమంగా కామ క్రోధాదులు తగ్గడమే ఆధ్యాత్మిక పురోగమనానికి కొలబద్ధ.

204. ఆధ్యాత్మిక సాధన బలపడ్డాక కలిగేది ఏమిటి ?
జ. భగవంతుడైన వాసుదేవుని యందు ప్రేమ ఏర్పడడం.

205. నిరంతరము భగవచ్చింతనలో ఉన్న వారికి ఏమి జరుగుతుంది ?
జ. అజ్ఞాన బీజ వాసనలు దగ్ధం అయి అధోక్షజుని పొందుతాడు.

206. నిష్కాముడు అయిన భగవంతుడు తెలియబడాలి అంటే ఎటువంటి భక్తితో పట్టుకోవాలి ?
జ. నిష్కామ భక్తితో.

207.భాగవత ధర్మానికి అధికారులు ఎవరు? అర్హత ఏమిటి?
జ. అందరూ అధికారులే, భగవంతుడు కావాలి అనే కోరికయే అర్హత.

208. విష్ణువు ఎక్కడున్నాడు అని అడిగిన హిరణ్యకశిపుని ప్రహ్లాదుడు ఏమని బదులిచ్చాడు?
జ. సముద్రం, గాలి, నేల, నీరు, నిప్పు, స్త్రీ, పురుష, నపుంసకాదులలో, త్రిమూర్తులలో, ఓంకారంలో, అన్నిటా అంతటా ఉన్నాడు. వెతికి చూస్తే ఎందైనా ఉంటాడు అని బదులిచ్చాడు.

209.స్తంభంలో విష్ణువు ఉంటాడా అని హిరణ్యకశిపుడు అడిగినప్పుడు ప్రహ్లాదుడు ఏమని అన్నాడు ?
జ. "గడ్డి పరక నుండి బ్రహ్మ వరకు వ్యాపించిన పరమాత్మ స్తంభంయందు ఉండడా? నీకు ఇవాళ ప్రత్యక్షమై తీరతాడు" అని అన్నాడు.

210.ప్రత్యక్షం, అంతర్ధానం అనగా ఏమిటి ?
జ. ప్రత్యక్షం అనగా ఉన్నవాడే కంటికి ఎదురుగా కనపడుట; అంతర్ధానం అనగా అక్కడే లీనం అగుట.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

211. ప్రహ్లాద హిరణ్యకశిపుల మధ్య చర్చ జరుగుతూ ఉండగా పరమాత్మ ఎలా ఉన్నారు ?
జ. అంతటా ఉన్న విష్ణువు ఆ సమయంలో గడ్డిపరక, ధూళికణం వరకు అంతటా నరసింహాకృతిలో ఉన్నాడు.

212. హిరణ్యకశిపుడు స్తంభాన్ని అరచేత కొట్టగానే ఏమి జరిగింది ?
జ. ప్రపంచానికే నాదం ఇచ్చే మహానాదం వినపడి, అది విజృంభించి ఒక మహాజ్వాల కనపడింది, దానినుంచి స్వామి ఆవిర్భవించాడు.


213. నరసింహ స్వామి త్రిమూర్త్యాత్మకం అయిన బ్రహ్మంగా ఎలా వర్ణించబడ్డాడు ?
జ. ఆనాభేర్బ్రహ్మణో రూపం
ఆ గళాద్ వైష్ణవం వపుః
ఆ శీర్షాద్ రుద్ర రూపం తం
తదగ్ర సర్వాత శివమ్
పాదం నుండి కటి వరకు బ్రహ్మ, కటి నుండి కంఠం వరకు విష్ణువు, కంఠం నుండి శిరస్సు వరకు రుద్రుడు; త్రిమూర్త్యాత్మకం అయిన నారాయణబ్రహ్మం నారసింహుడు.



214. నరసింహ అవతారంలో ఒక ప్రత్యేకత ఏమిటి ?
జ. ప్రహ్లాదునిపై వాత్సల్యం, హిరణ్యకశిపునిపై ఆగ్రహం ఒకటేసారి చూపించాల్సి వచ్చింది. ద్వంద్వాతీతుడు అయి ద్వంద్వములయందు సమంగా వ్యాపించినవాడు ద్వంద్వ భావముల ఎదురుగా ఒక్క విధంగా కనపడ్డాడు స్వామి.

215. స్వామి నరసింహావిర్భావం ఎవరి కోసం ?
జ. తన భృత్యువు (ప్రహ్లాదుడు/హిరణ్యకశిపుడు/సనకసనందనాదులు) కోసం, సర్వభూతములలో వ్యాపించినది తానే అని చెప్పడానికి.

216. నరసింహ స్వామి హిరణ్యకశిపుని ఎలా సంహరించారు ?
జ. సంధ్యా సమయమున, సభా భవనం బయటికి లోపలకి మధ్యలో ఉన్న మహాద్వారం మీద, తన తొడలపై పడేసి, గోళ్లతో వక్షస్థలాన్ని చీల్చి సంహరించారు.



217. స్వామిని శాంతపరచడానికి దేవతలు ఎవరిని పంపారు ?
జ. ప్రహ్లాదుని.

218. స్వామి వద్దకు ప్రహ్లాదుడు ఎలా వెళ్ళాడు ?
జ. ఏ భయం లేకుండా, శాంతమే తాను అయి ఉన్న స్వామిని శాంతపరచడం ఏమిటి అనుకుంటూ వెళ్ళాడు.

219.పరమాత్మ ని చూడటంలో ప్రహ్లాదుడికి ఇతర దేవతలకి ఉన్న తేడా ఏమిటి ?
జ. అందరూ భగవంతుడిని చూస్తున్నప్పుడు వారి వారి దృష్టి నుంచి వారి ప్రయోజనాలని బట్టి చూస్తున్నారు పాక్షిక దృష్టితో, కానీ ఒక్క ప్రహ్లాదుడు మాత్రమే భగవానుని భగవానుడిలా చూస్తున్నాడు.

220. స్వామి ఒక్కొక్క అవతారంలో ఒక్కొక్క తత్త్వం చూపిస్తారు. నరసింహ అవతారంలో చూపించిన తత్త్వం ఏమిటి ?
జ. మాతృవాత్సల్యం.

221. నరసింహ అవతారానికి గల ఇతర పేర్లు ?
జ. సంధ్యావతారం/సద్యోజాత అవతారం/వైద్యుతావతారం/పరిపూర్ణావతారం/యోగావతారం.

222. నృసింహ ఉపాసన గురించి చెప్పే ఉపనిషత్తు ఏమిటి ?
జ. నృసింహ తాపనియోపనిషత్తు.

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

223. ప్రహ్లాదుడు నరసింహ స్వామిని ఏమి కోరాడు?

జ. "జీవితం ఉన్నంత కాలం నీకు స్తోత్రం చేస్తూ, కర్మలని నీకు అర్పణ చేస్తూ, నిన్నే ఆరాధిస్తూ, నీ పాదాలను నిత్యం స్మరిస్తూ, నీ గాధలను వింటూ ఉండాలి స్వామి, ఇదే నాకు షడంగము, ఇది ప్రసాదించు" అని అడిగాడు.

224. ప్రహ్లాదుడు కోరుకున్నటువంటి షడంగ భక్తి వల్ల ఏమి లభిస్తుంది ?

జ. ఆత్మరూపుడు అయిన పరమాత్మ తెలియబడతాడు.

## శ్రీ గురువు గారి ఆశీస్సులతో

### Contributors of Sri Bhagvatham CD# 3.2-4.1 –Dec 2018

| | | |
|---|---|---|
| 1 | Madhukar Dudipala | Nebraska |
| 2 | Sadgun Khambhampati | California |
| 3 | Ratnakar | New Jersey |
| 4 | Sri Vadrevu | North Carolina |
| 5 | Suneetha Kothapalli | California |
| 6 | Ravikanth Somaghatta | New Jersey |
| 7 | Gayatri Mallampalli | California |
| 8 | Uma Tapsvi | Tennessee |
| 9 | Madhu Mahankali | India |

Copyright@gurujnanam.org Disclaimer:This document is not for commercial purpose

సర్వం శ్రీకృష్ణచరణారవిందార్పణమస్తు

